ప్రజాశక్తి

సోమవారం 13 మే 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం



విజయనగరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో మెటీరియల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సోమవారం ఉదయం 7గంటలకు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. పోలింగ్ సామాగ్రితో సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. శనివారం ఉదయమే నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని ఇవిఎంలు, పోలింగ్ సామగ్రి తీసుకుని, ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. పోలింగ్ సిబ్బందికోసం ఉపయోగించే అన్ని వాహనాలకూ భద్రత నిమిత్తం జిపిఎస్ సిస్టమ్ అమర్చారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ధైర్యంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ జిల్లా ఎన్నిల అధికారులు ప్రకటించారు. జిల్లా ఎస్‌పిల నాయకత్వంలో ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్మాత్మక కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని కూడా నియమించారు. వాటిలో కొన్ని చోట్ల వెబ్ టెలికాస్ట్ కూడా చేయనున్నారు. విజయనగరం జిల్లాలో 10 పోలింగ్ స్టేషన్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 5 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు.



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పార్వతీపురం మన్యం కలెక్టర్ నిశాంత్‌కుమార్

నేడే పోలింగ్

విజయనగరం జిల్లా

అసెంబ్లీ నియోజకవర్గాలు	7
ఓటర్లు	15,62,921
పోలింగ్ కేంద్రాలు	1847
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	362
పోలింగ్ సిబ్బంది	13661

సిబ్బందికి సూచనలిస్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి


పార్వతీపురం మన్యం జిల్లా

అసెంబ్లీ నియోజకవర్గాలు	4
ఓటర్లు	7,83,440
పోలింగ్ కేంద్రాలు	1031
సమస్యాత్మక కేంద్రాలు	219
పోలింగ్ సిబ్బంది	6600

- సర్వం సిద్ధం.. ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- అన్నిచోట్లా పటిష్ట బందోబస్తు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్
- ఉదయం 5.30కే మాక్ పోల్
- విజయనగరం జిల్లాలో 11, మన్యంలో 6 మోడల్ పోలింగ్ కేంద్రాలు

ఉదయం 5.30కే మాక్ పోల్

ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఉదయం 5.30కే రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహిస్తారు. ఏజెంట్లు సమయానికి రానిపక్షంలో, ఎట్టి పరిస్థితిలోనూ 5.45 గంటలకల్లా మాక్ పోల్ పూర్తి చేయనున్నారు.



బస్సుల్లో బయల్దేరి వెళ్తున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి


విజయనగరంలో 15,62,921 మంది ఓటర్లు ఉండగా, వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా మొత్తం 1847 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకు 13661మంది సిబ్బందిని నియమించారు.

పార్వతీపురం జిల్లాలో 7,83,440మంది ఓటర్లుకుగాను 1031 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 6600 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. జిల్లాలో 219 వరకు సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. వీటిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం ఉమ్మడి జిల్లాలో 80శాతం ఓటింగ్ జరిగింది. ఈసారి అంతకు మించి ఓటింగ్ జరిగే విధంగా ఎన్నికల ఏర్పాట్లు, ఓటర్ల చైతన్యం వంటివి చేశామని అధికారులు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల కోసం 716 వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. వారిని పోలింగ్ కేంద్రంలోకి తీసుకువెళ్లేందుకు ఎన్‌సిసి వలంటీర్లను నియమించారు. అంధుల కోసం (మిగతా..3లో)



విజయనగరంలో సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద సిబ్బంది

ఓటరు తీర్పు ఎవరికో?



- ఉమ్మడి జిల్లాలో 134 మంది పోటీ
- దారులన్నీ పోలింగ్ కేంద్రాలవైపే
- బస్సులు, రైళ్లు కిటకిట
- మద్యం, డబ్బు ఎన్నికల్లో ప్రభావం చూపేనా?
- టిడిపి, వైసిపిలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్, సిపిఎం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఐదేళ్లకోసారి పాలకులను నిర్ణయించుకునే సందర్భం మరోసారి వచ్చింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ రోజు వేసిన ఓట్లు, మెజార్టీ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు కానున్నాయి. ఇలా ఏర్పడిన ప్రభుత్వాలు రానున్న ఐదేళ్లపాటు ప్రజల్ని పాలించనున్నాయి. ఈ నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వలస ఓటర్లు తమ స్వగ్రామాలకు భారీగా తరలి వస్తున్నారు. శెలవుదినం కావడంతో ఆదివారం ఉదయం నుంచే బస్సులు, రైళ్లు, ఇతర ప్రైవేటు వాహనాలు కిటకిటలాడాయి. దారులన్నీ పోలింగ్ కేంద్రాలవైపే పరుగులు తీస్తున్నాయి. దీంతో, రహదారులు రద్దీగా మారాయి. తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఎంతో ఉత్సాహంతో చేరుకుంటున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 80శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్ర సరాసరి ఓటింగ్‌తో పోలిస్తే రెండు శాతం తక్కువ అయినప్పటికీ మిగిలిన అన్ని జిల్లాలతో పోలిస్తే ఎక్కువే. ప్రస్తుత ఎన్నికల్లోనూ అంతకు మించిన ఉత్సాహం కనిపిస్తుండడంతో (మిగతా..3లో)

రైల్వేస్టేషన్ నుంచి వస్తున్న వలస ఓటర్లు



స్వగ్రామాలకు వలస ఓటర్లు

- ఓటేసేందుకు తరలివచ్చిన జనం
- కిటకిటలాడిన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు
- సరిపడా బస్సుల్లేక అవస్థలు
- ఆర్‌టిసి తీరుపై మండిపాటు

2లో

స్వగ్రామాలకు వలస ఓటర్లు

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఎన్నికల్లో వలస ఓటర్లు కీలకంగా మారనున్నారు. వీరి ఓట్లు కోసం అధికార, ప్రతిపక్ష, స్వతంత్ర అభ్యర్థులు ఇప్పటికే ఓటుకు నోటు ఇచ్చి, రాను పోను చార్జీలు కూడా ఇచ్చారు. సోమవారం ఎన్నిక కావడంతో ఆదివారం జిల్లాకు వలస ఓటర్లు క్యూ కట్టారు. దీంతో రైలు, బస్సులు కిటకిటలాడాయి. జిల్లాకు చెందిన వలస కూలీలు చాలా మంది విశాఖ, విజయవాడ, హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు, కలకత్తా, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరందరినీ ఆయా గ్రామాలకు చెందిన నాయకులు ఓటు వేసేందుకు పెద్ద ఎత్తులో ఖర్చు పెట్టి తిరిగి గ్రామాలకు రప్పిస్తున్నారు. వీరంతా ఒకేసారి రావడంతో బస్సులు, రైలు చాలక ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వ్యవసాయ పనుల కోసం విజయనగరం నుంచి ఎక్కువ మంది వలస కూలీలుగా వెళ్లి అక్కడే ఉంటున్నారు. వారంతా తమ ఓటును వినియోగించుకోవడానికి తిరిగి రావడంతో బస్సులు కిక్కిరిసాయి.

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో వలసలు సుమారు 1.50లక్షలు మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. వీరంతా ఆదివారం ఉదయం, సాయంత్రం రావడంతో బస్సులు చాలక ఇబ్బందులు పడ్డారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కును ఎలాగైనా వినియోగించుకోవాలని కొంత మంది, తాయిలాలకు ఆశపడి కొంత మంది వలస ఓటర్లు స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

బస్సులు లేక అవస్థలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయనగరం



బొబ్బిలి: రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్న ఓటర్లు



విజయనగరం: బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆర్‌టిసి డిపో నుంచి బస్సులను ఎన్నికల నిర్వహణకు తరలించడంతో కాంప్లెక్స్ సరిపడా బస్సు లేక ఖాళీగా దర్శనమిచ్చింది. దీంతో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ముఖ్యంగా వలస ఓటర్లు సుధీర ప్రాంతాల నుంచి రైలు ద్వారా వచ్చి విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ చేరుకునేసరికి బస్సు లేకపోవడంతో అసహనానికి గురయ్యారు. వచ్చిన ఒకటో రెండో బస్సులకు ప్రయాణికులు ఎక్కేందుకు పోటీపడుతూ కిందపడి గాయపడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు.

ఎన్నికలకు 116 బస్సులు

జిల్లా పరిధిలో రెండు డిపోలు ఉండగా విజయనగరం డిపోలో 126 ఆర్‌టిసి బస్సులకు గాను 84 బస్సులను ఎన్నికలకు తరలించారు. ఎస్ కోట డిపోలో 50 బస్సులకు గాను 32 బస్సులను తరలించారు. దీంతో సకాలంలో బస్సులు రాక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కేవలం 40 బస్సులను మాత్రమే విజయనగరం అందుబాటులో ఉంచడంతో అవస్థలు పడ్డారు. వలస ఓటర్లు ఎక్కువగా రావడంతో కాంప్లెక్స్ కిటకిటలాడింది. బస్సులు వస్తాయని చాలా మంది ప్రయాణికులు కొన్ని గంటలపాటు డిపోలకే పరిమితమయ్యారు. చిన్న పిల్లలతోనూ ముసలి వాళ్ళతో వారు తెచ్చుకున్న లగేజీలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరికి మరో మార్గం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

బొబ్బిలి: ఓటు వేసేందుకు వలస ఓటర్లు సొంత గ్రామాలకు తరలివచ్చారు. జీవనోపాధి కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలు వెళ్లిన వ్యవసాయ కూలీలు, కార్మికులు, ఉద్యోగులు ఓటు వేసేందుకు తరలిరావడంతో రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ కిటకిటలాడాయి. ఆర్‌టిసి బస్సులు అరకొరగా ఉండటంతో రైళ్లలో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. మూడు రోజుల నుంచి రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు వైసిపి, టిడిపి అభ్యర్థులు వలస ఓటర్లపై గురి పెట్టడంతో వారంతా ఓటు వేసేందుకు స్వగ్రామాలకు చేరుకున్నారు.

బస్సుల కోసం తప్పని తిప్పలు

ఎన్నికల విధులకు ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఆర్‌టిసి బస్సులు అరకొరగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓట్లు వేసేందుకు దూర ప్రాంతాల్లో ఉన్న వారంతా సొంత గ్రామాలకు వస్తున్నారు. వారంతా బస్సులు లేక అవస్థలు పడుతున్నారు. ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ప్రయివేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

ఓటేసేందుకు వచ్చిన వలస గిరిజనులు

శృంగవరపుకోట : మండలంలో, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాల నుంచి పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన గిరిజనులు ఆదివారం స్వగ్రామాలకు చేరుకున్నారు. రాష్ట్రంలోని నెల్లూరు, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఇటుకల బట్టిలో, వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసేందుకు వెళ్లిన గిరిజనులు మండలంలోని బొడ్డవర ప్రాంతానికి వచ్చి అక్కడ నుండి ఆటోలో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. జీవనోపాధి కోసం ఎంత దూరం వెళ్లినా ఎన్నికల సమయంలో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకుంటామని వారు చెబుతున్నారు.



ఎస్‌కోట: బస్సు కోసం నిరీక్షిస్తున్న వలస ఓటర్లు

శాంతిభద్రతలకు భంగం కలగొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చూసుకోవలసిన బాధ్యత పోలీసులదేనని ఎస్‌పి దీపిక పాటిల్ సూచించారు. సార్వత్రిక ఎన్నికలలో శృంగవరపుకోట నియోజక వర్గంలో బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన పోలీస్ సిబ్బందితో సోమవారం పట్టణంలో కళాశాల మైదానంలో ఆమె మాట్లాడి, దిశానిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ సోమవారం ఉదయం 3 గంటల నుంచి పోలింగ్ ముగిసి, ఇవిఎంలు స్ట్రాంగ్‌రూమ్‌కు చేరేవరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమతి లేఖ ఉన్న జర్నలిస్టులు పోలింగ్ బూత్‌లో ప్రవేశించి నిబంధనలకు లోబడి ఫొటోలు తీసుకోవచ్చునని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎఎస్‌పి జావలి, సిఐ మురళి, ఎస్‌ఐ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకర్షిస్తున్న మోడల్ పోలింగ్ స్టేషన్



మెట్టపల్లిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్

చీపురుపల్లి: ఓటరు చైతన్యంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించిన ఎన్నికల అధికారులు ప్రస్తుతం పోలింగ్ బూత్ నమూనాలతో ఓటరు ప్రక్రియ పై అవగాహన కల్పిస్తుంది. అందులో భాగంగానే మండలంలోని మెట్టపల్లి గ్రామంలో పోలింగ్ అధికారులు మోడల్ పోలింగ్ స్టేషన్‌ని ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ స్టేషన్‌ని పింక్ పోలింగ్ స్టేషన్‌గా నామ కరణ చేశారు. ఇక్కడ కేవలం మహిళలు మాత్రమే ఓట్లు వేసేం దుకు వీలుగా రంగుల పువ్వులు, వివిధ సాంస్కృతిక పనిముట్లు రంగుల రూపంలో వేసి అత్యంత సుందరంగా అలంకరించారు. మామిడి తోరణాలు కట్టి ఓటర్లును ఆకర్షించే విధంగా పోలింగ్ స్టేషన్ సిద్ధం చేశారు. ఈ పోలింగ్ స్టేషన్‌ను చూసేందుకు

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



బొబ్బిలి : భోజనాలు కోసం క్యూలో నిలబడిన ఉద్యోగులు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ కోరారు. ఆర్‌డిఒ కార్యాల యంలో ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా అధికారులను నియమించి మెటీరి యల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలింగ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. గొడవలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఇవిఎంలు మొరాయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. 264 పోలింగ్ బూత్‌లకు 264 ఇవిఎంలను పంపిణీ చేశారు. పిఒలు 264 మంది, ఎపిఒలు 264 మంది, ఒపిఒలు 1056 మందిని నియమించారు. నియోజకవర్గంలో రూట్లలో 31 సెక్టార్లను ఏర్పాటు చేసి రూట్, సెక్టార్ అధికారులను నియమించారు. ఎన్నికల సిబ్బంది, సామగ్రిని ప్రత్యేక బస్సులు, ఇతర వాహనాలు ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

కలెక్టర్ సందర్శన

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ, ఎన్నికల సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌పై పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చూడాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో అసిస్టెంట్ కలెక్టర్ ఉన్నారు.

భోజనాల కోసం నిరీక్షణ

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద భోజనాల కోసం అధికారులు క్యూ లైన్లలో నిరీక్షించారు. ఎన్నికల నిర్వహణకు 1584 మందిని నియమించారు. రిజర్వ్‌లో మరో 150 మంది వరకు ఉంచారు. వీరందరికీ భోజనాలు ఏర్పాటు చేసినప్పటికీ రెండు కౌంటర్లు మాత్రమే ఉంచారు. భోజనాల కోసం ఎన్నికల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

శృంగవరపుకోట: నియోజకవర్గంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. శృంగవ రపుకోట నియోజకవర్గంలో 270 పోలింగ్ బూతులకు సంబంధించి సిబ్బంది ఎన్నికల సామగ్రితో స్టేష న్లకు చేరారని ఆయన తెలిపారు. పోలి ంగ్ స్టేషన్లో సిబ్బందికి విద్యుత్, మరు గుదొడ్లు, భోజన వసతులతో కూడిన సౌకర్యాలను కల్పించామని తెలిపారు.

248 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్

నెల్లిమర్ల: నియోజక వర్గంలో 248 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు సిద్ధం చేసి ఎన్నికల సామాగ్రి తరలించారు. ఆదివారం నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రం ఎంజెబిపి బిసి గురుకుల పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. 1248మంది ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల్లో సేవలు అందిస్తారు. నియోజకవర్గంలో 61 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికార్లు గుర్తించి ఆయా కేంద్రాల్లో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆర్‌ఒ ఎం.నూక రాజు, ఎఆర్‌ఒ డి. ధర్మ రాజు, పిఒ, ఎపిఒలకు ఎన్నికల సామాగ్రి ఇవిఎంలు, వివి ప్యాడ్లు కేటాయించి వాహనాల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు.



నెల్లిమర్ల: సొమ్మసిల్లిన ఉద్యోగిని తరలిస్తున్న సిబ్బంది

సొమ్మసిల్లి పడిపోయిన పోలింగ్ ఆఫీసర్

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో పోలింగ్ విధి నిర్వహణకు వచ్చిన పోలింగ్ ఆఫీసర్ పి. శ్రీమాధవన్ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే తోటి ఉద్యోగులు వచ్చి సపర్యలు చేశారు. మెడికల్ సిబ్బంది వైద్య తనిఖీలు చేశారు. ఆయన పూసపాటి రేగ మండలం పశు పాంలో పోలింగ్ అధికారిగా విధులు నిర్వహించాల్సి ఉంది. దత్తి రాజేరు మండలం పెదకాద ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సొమ్మసిల్లి పడిపోయి గంట సేపు అయినప్పటికీ పక్కనే వున్న రిటర్నింగ్ అధికారి నూకరాజు కనీసం పట్టించుకోకపోవడం పట్ల ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణా కళాశాల కేంద్రంలో ఉద్యోగి ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పడిపోయాడు. ఆయనకు వెంటనే వైద్య సిబ్బంది సపర్యలు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వేపాడ: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎంపిడిఒ నిశ్చలత పరిశీలిం చారు. ఆయా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో మాట్లాడి, సూచనలు చేశారు. నిర్వహణలో ఏ విధమైన లోపాలున్నా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు.

2048 మందితో పోలింగ్ ఏర్పాట్లు

చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గంలో 2048 పోలింగ్ సిబ్బందింతో పోలింగ్ జరిపేందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సోమవారమే కావడంతో ఆదివారం గరివిడికి చెందిన ఎస్‌డిఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూటరీ సెంటర్ల వద్ద ఉదయం ఏడు గంటల నుండే పోలింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారిని బి.శాంతి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

డిస్ట్రిబ్యూటరీ సెంటర్‌ని సందర్శించిన కలెక్టర్

గరివిడిలో గల ఎస్‌డిఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూటరీ సెంటర్‌ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లూ చేయాలని రిటర్నింగ్ అధికారి బి.శాంతిని ఆదేశించారు. వివిప్యాట్‌లను డిస్ట్రిబ్యూటరీ సెంటర్‌లోనే పరిశీలించి పోలింగ్ సిబ్బందికి అందజేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రజాశక్తి

3

సోమవారం 13 మే 2024

విజయనగరం..రసవత్తరం

- పోల్ మేనేజ్మెంట్‌పైనే వైసిపి, టిడిపి దృష్టి
- అర్ధరాత్రి వరకూ కొనసాగిన ఓటుకు నోటు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నిక రానే వచ్చింది. విజయనగరం నియోజకవర్గంలో వైసిపి, టిడిపి, స్వతంత్ర అభ్యర్థులు కోలగట్లవీరభద్రస్వామి, పి.అదితి విజయలక్ష్మి, మీసాల గీత మధ్య రసవత్తర పోటీ నెలకొంది. వైసిపి, టిడిపి అభ్యర్థులు ఇప్పటికే ఓటర్లకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి వరకూ ఇంటింటికీ డబ్బుల పంపిణీ కొనసాగింది. డబ్బులు అందని వారు వైసిపి కార్యాలయాలకు వెళ్లి మరి స్లిప్‌లు చూపించి డబ్బులు అడిగి తీసుకున్నారు. నియోజకవర్గం పరిధిలో 50 డివిజన్లు, 22 పంచాయతీలు ఉన్నాయి. మొత్తంగా నియోజకవర్గంలోని 2,57,205 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 260 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఇప్పటికీ మూడేసి సార్లు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లను చుట్టుముట్టారు. ఎన్నికల ప్రచారం రాత్రి పగలు అని తేడాలేకుండా ,సమయంతో సంబంధం లేకుండా ప్రచారం నిర్వహించారు. ఇంటి ఇంటికి తిరగడం, సభలు సమావేశాలు పెట్టడం,ఆత్మీయ కలయికలు పేరుతో సమావేశాలు, కులాలు వారీగా సమీకరణాలు కలవడం వంటి ప్రచార కార్యక్రమాలు శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు చేపట్టారు. అభ్యర్థుల గెలుపు కోసం వారి కుటుంబ సభ్యులు కూడా ఎన్నికల ప్రచారం లో మునిగితేలారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే సమయం ముగిసింది.ఎన్నికల్లో ప్రధాన ఘట్టం ఓటింగ్ సోమవారం జరగనుంది.ఇప్పటికే అధికార్లు ఓటింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ప్రధాన పోటీ ఉన్న అభ్యర్థులు వైసిపి,టిడిపి అభ్యర్థులు ప్రజలను ఓట్లు వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తలమునకలై ఉన్నారు. పోల్ మేనేజ్మెంట్ చేసుకోవడం ద్వారా ఓట్లు ఎక్కువ వేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేకతను ఉపయోగించుకొని ఓట్లను వేయించుకునే దిశగా ప్రతిపక్ష కూటమి అభ్యర్థి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందుకు అనుగుణంగా కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసి ఓటింగ్ కి వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నారు. మరో వైపు అధికార పార్టీ కి చెందిన ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి పోల్ మేనేజమెంట్ చేయడంలో దిట్ట. అందుకు తగ్గట్టుగా వాలంటీర్లు ను ఉపయోగించుకొని, బూత్ కన్వీనర్లు ద్వారా వారి ఓట్లను వేయించుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో ప్రతి 50ఇళ్లకు వాలంటీర్లు సేవలు అందించడంతో వారి ద్వారా రంగం సిద్ధం చేసుకున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా ఆటోలు, బైక్‌లు, కార్లు వంటి వాహనాలను సిద్ధం చేసుకున్నారు. ఓటర్లను వాహనాలు ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించే విధంగా రూట్ మ్యాప్ లు కూడా ప్రధాన పార్టీలు సిద్ధం చేసుకున్నారు. ఒక్క ఓటు కూడా వృథా కాకూడదనే ఉద్దేశంతోనే ఉన్న అన్ని ఓట్లు వేయించుకుని విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలకు చెందిన టిడిపి, వైసిపి అభ్యర్థులు ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున ఓటర్లకు పంపిణీ చేశారు. సోమవారం నాడు కూడా ఓట్లు కొనుగోలు చేసుకునే విధంగా వార్డుకు వారీగా బాధ్యతలు అప్పగించారు. అయితే ఓటర్లు ఓటు ఓటు వేస్తారో, ఎవరిని గెలిపిస్తారో వేచి చూడాల్సిందే.



ఆస్పత్రిలో మృతి చెందిన సంగం

విశ్రాంతి ఉద్యోగి హత్య

- అర్ధరాత్రి కత్తితో పొడిచిన దుండగులు
- డిఎస్‌పి ఆధ్వర్యంలో విచారణ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్న శిర్లాం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దళిత కాలనీలో నివాసం ఉంటున్న టిడిపి నేత, విశ్రాంతి కోర్టు ఉద్యోగి ఉత్తరావిల్లి సంగం (65) దారుణ హత్యకు గురయ్యాడు. అర్ధరాత్రి అతని కుటుంబ సభ్యులు నిద్రలో నుంచి లేచి చూసేసరికి మెడపై కత్తిపోట్లుతో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. భయభ్రాంతులకు గురైన కుటుంబ సభ్యులు తక్షణమే రాజు కేర్ ఆసుపత్రికి తరలించగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఎప్పటిలాగే శనివారం ఇంటి బయట వరండాలో సంగం పడుకున్నారు. గుర్తు తెలియని దుండగులు బైక్ పై వచ్చి కత్తితో గొంతు కోసి పరారయ్యారు. మృతుని భార్య నక్షత్రమ్మ ఫిర్యాదు మేరకు చీపురుపల్లి డిఎస్‌పి మహేంద్ర, రాజాం రూరల్ సిఐ శ్రీనివాసరావు క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముందు రోజే హత్యకు గురికావడంతో రాజకీయ హత్యేనని కుటుంబ సభ్యులు, మృతుని మేనకోడలు మాజీ జెడ్‌పిటిసి మంతెన ఉషారాణి ఆరోపించారు. 2019లో మృతుడు సంఘం టిడిపిలో చురుకైన పాత్ర వహించి, పార్టీకి క్రియాశీలకంగా సేవలందించారు. తన మేనకోడలు మంతన ఉషారాణికి రాజకీయంగా చేదోడువాదోడుగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. అతన్ని గ్రామంలో రాజకీయంగా ఎదుర్కొనలేకే హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. హత్య చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. రాజాం ఏరియా ఆసుపత్రిలో మృతుని కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, రాజాం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండ్రు మురళి మోహన్ ఓదార్చారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. సంగంకు పంచనామా నిర్వహించి రాజాం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం: డిఎస్‌పి

రిటైర్డ్ ఉద్యోగి ఉత్తరావల్లి సంగం అనుమానాస్పద మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. కేసును వేగవంతంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేస్తాం.. ఇప్పటికే క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపాం.

ఓటరు తీర్పు ఎవరికో?

(మొదటిపేజీ తరువాయి)

ఓటర్లు ఏ పార్టీవైపు మొగ్గుచూపుతారో? అన్న అసక్తికరమైన చర్చనడుస్తోంది. ఉమ్మడి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ భారీగా పోలవ్వడంతో వైసిపి, టిడిపి అభ్యర్థుల్లో ఎవరికి టనష్టం కలుగు తుందోనన్న గుబులు నెలకొంది. రెండు జిల్లాల్లోనూ టిడిపి కూటమి, వైసిపి ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు 134 మంది పోటీలో ఉన్నారు. మన్యం జిల్లాలో సిపిఎం పోటీచేస్తుండడంతో అక్కడ ముక్కోణపు పోటీ నెలకుంది. విజయ నగరంలో మాజీ ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండడం వల్ల ఆమెకు వచ్చే ఓట్లు టిడిపి, వైసిపి అభ్యర్థుల గెలుపోటములు ప్రభావితం చేసే అవకాశం ఉంది.

విజయనగరం జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 77 మంది పోటీ పడుతున్నారు. విజయనగరం అసెంబ్లీ స్థానంలో 15 మంది అభ్యర్థులు, శంగవరపుకోట లో 12, నెల్లిమర్ల లో 12, గజపతినగరం లో 13, చీపురుపల్లి లో 7, రాజాం లో 10, బొబ్బిలిలో 8 మంది, పార్వతీపురంలో 8 మంది, కురుపాంలో ఏడుగురు, సాలూరులో ఏడుగురు, పాలకొండలో ఏడుగురు పోటీ చేస్తున్నారు. విజయనగరం పార్లమెంటు స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని అరకు పార్లమెంట్ స్థానంలో 13మంది పోటీలో నిలిచారు. వీరిలో కురుపాంలో సిపిఎం మిగిలిన అన్ని పార్టీలూ ఓటర్లకు డబ్బు, మద్యం ఎరజూపాయి. ముఖ్యంగా ప్రధాన పార్టీలు రెండూ ఇందులో పోటాపోటీగా పంపిణీ చేశాయి. కానీ, వీటి ప్రభావం ఏమేరకు ఉంటుందో వేచిచూడాల్సిందే. దూర ప్రాంతాలనుంచి వ్యయ, ప్రాయసతో పనులు మానుకుని, సెలవులు పెట్టికుని మరీ వచ్చిన ఓటర్లు అంత తేలిగ్గా ఓట్లేసే పరిస్థితి లేదు. బిజెపితో టిడిపి నేరుగా పొత్తుపెట్టుకుంది. వైసిపి పరోక్షంగా గడిచిన ఐదేళ్లపాటు సహకరిస్తూ వచ్చింది. గడివచిన పదేళ్లలో ఈ రెండు పార్టీలూ బిజెపి విధానాలు నిస్సిగ్గుగా, నిస్సంకోచంగా అమలు చేశాయి. ఈ నేపథ్యంలో బిజెపి ప్రత్నామ్నాయంగా దాదాపు అన్నిచోట్లా 'ఇండియా' వేదిక తరపున కాంగ్రెస్, సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఆయా పార్టీలు, అభ్యర్థులు రాష్ట్ర ప్రజానీకం కోరుకుంటున్న ఎపికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ సహా అనేక హామీల అమలుకు కృషి చేస్తామని చెప్తున్నారు. ఈనేపథ్యంలో బలమైన పార్టీలుగావున్న టిడిపి, వైసిపిలకే మళ్లీ పట్టం కడతారా? పదేళ్లపాటు రాష్ట్రానికి మోసం చేయడంతోపాటు అనేక రాష్ట్రాల్లో మత కల్లోలాలు సృష్టించిన రాజ్యాంగాన్ని ఉల్లఘంచిన బిజెపికి గుణపాఠం చెబుతారా? కాంగ్రెస్, సిపిఎం అభ్యర్థులకు ఓట్లేసి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడుతారా? వేచిచూడాల్సిందే.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని ఆరికతోట సమీపంలో జాతీయ రహదారిపై బైకుపై వెళ తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మండలంలోని ముచ్చర్ల వలసకు చెందిన బొడ్డు జగన్‌మోహనరావు(42) బైకుపై తాను పనిచేస్తున్న కర్రల డిపో వద్దకు వెళ్తుండగా ఎదురుగా అజాగ్రత్తగా, మితిమీరిన వేగంతో వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

45 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - భోగాపురం

అక్రమంగా 45 మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ కె.సురేష్ తెలిపారు. డివిజనల్ టాస్క్ ఫోర్స్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా సవరవల్లి పంచాయతీ గొల్లపేట వద్ద బర్ల గురుమూర్తి అనే వ్యక్తి వద్ద 45 మద్యం సీసాలు లభించాయని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

నేడే పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బ్రెయిలీ బ్యాలెట్ నమూనాలను అందుబాటులో ఉంచుతున్నారు. బదిరుల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు, ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు, అవసరమైన కుర్చీలు, బూత్‌లవద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

పోలీస్ భద్రతా చర్యల్లో భాగంగా రాష్ట్ర, కేంద్ర బలాగాలను కూడా అందుబాటులో ఉంచారు. అవసరమైన చోటుకి కేవలం 5 నిమిషాల్లోనే అక్కడికి చేరుకొనే విధంగా ర్యాపిడ్ యాక్షన్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని లైసెన్సు తీసుకున్న తుపాకులను పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. గతంలో గొడవలకు కారణమైనవారు, ప్రస్తుతం ఆవిధంగా వ్యవహరిస్తారని అనుమానం ఉన్నవారిపై పోలీసులు బైండోవర్ కేసులు కూడా నమోదు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంది. పోలింగ్ అనంతరం పోలీస్ బందో బస్తు నడుమ ఇవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు (రిసెప్షన్ సెంటర్లకు) చేర్చనున్నారు.

11 మోడల్ పోలింగ్ కేంద్రాలు

ఓటర్లలో స్ఫూర్తి నింపేందుకు జిల్లాలో 11 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అదనపు హంగులు కల్పించారు. పూసపాటిరేగ మండలం కొత్తకొప్పెర్ల, విజయనగరం పట్టణంలోని పేర్లవారి వీధి పోలింగ్ కేంద్రాలను యువత కోసం, రాజాంలోని మాధవ బజార్, బొబ్బిలి మహారాణి పేట, చీపురుపల్లిలోని మెట్టపల్లి, గంట్యాడ మండలం కరకవలస, డెంకాడ మండలం పెదతాడివాడ, విజయనగరంలోని వైఎస్ఆర్‌నగర్, కొత్తవలస మండలం చింతలపాలెం పోలింగ్ కేంద్రాలను మహిళల కోసం, నెల్లిమర్ల మండలం పూతికపేట, విజయనగరం కొత్త అగ్రహారంలోని బెస్ట్ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని విభిన్న ప్రతిభావంతుల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. జిల్లా కేంద్రంలోని మహారాజా ప్రభుత్వ సంగీత నత్య కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని యూనిక్ కేంద్రంగా రూపొందించారు.

226 రూట్‌లు

ఎన్నికల ప్రక్రియ కోసం సిబ్బందిని, సామగ్రిని తరలించడానికి జిల్లా వ్యాప్తంగా 226 రూట్లను ఏర్పాటు చేశారు. ఈ రూట్లలో 120 ఆర్‌టిసి బస్సులు, 265 మినీ బస్సులను వినియోగిస్తున్నారు. ఇవి కాకుండా ఎన్నికల అధికారులకు కార్లు, వ్యాన్‌లు తదితర ఇతర వాహనాలను సమకూర్చారు. మొత్తం 225 మంది సెక్టార్ అధికారులు ఈ రూట్లను పర్యవేక్షించనున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

జిల్లాలోని 362 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఇక్కడ ప్రత్యేక నిఘా, భద్రతా ఏర్పాట్లను చేశారు. ఈ ప్రాంతాలతో పాటుగా మొత్తం 1136 పోలింగ్ కేంద్రాల్లో 2272 వెబ్ కెమేరాలను వినియోగిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు మైక్రో అబ్జర్వర్లను సైతం నియమించారు. ఎన్నికల ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తున్నారు.

రిసెప్షన్ సెంటర్లు ఇవే

పోలింగ్ అనంతరం ఇవిఎంలు, ఎన్నికల సామగ్రిని తిరిగి తీసుకొనేందుకు జిల్లా కేంద్రం విజయనగరంలో రెండు చోట్ల రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాలకు, డెంకాడ మండలం లెండి కళాశాలలో నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాలకు రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడే ఇవిఎం స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశారు. పార్వతీపురం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఇవిఎంలను ఉల్లిభద్ర సమీపంలోని ఉద్యాన కళాశాలలో భద్రపర్చనున్నారు.

ప్రతిఒక్కరూ ఓటు వేయాలి

దృఢమైన ప్రజాస్వామ్యం కోసం ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు. మొదటిసారిగా ఓటుహక్కును వినియోగించుకుంటున్న యువత అంతా తప్పనిసరిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. సోమవారం జరగనున్న ఎన్నికల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడం కోసం కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలలను, ఎన్నికల సూక్ష్మ పరిశీలకులను, వీడియో గ్రాఫర్లను నియమించి, ఈ ప్రక్రియను సాఫీగా పూర్తి చేసేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
I.A.No.746/2023 IN O.S.302/2011

Between:
1.Pinnamaraju Ramakrishna Raju (Died)
2.Nallaparaju Surekha
3.Maddala Bharathy
...Petitioners / Plaintiffs
And:
Maddala Krishna Murthy Raju and Others **...Respondents / Defendants**

NOTICE TO THE 8th RESPONDENT

8th Respondent:
Smt. Kutcharlapati Venkata Rama,
W/o.Ramachandra Raju, Hindu,
aged 47 years, residing at D.No.101,
Thotapalem, Nitchavani Cheruvu Gattu,
Vizianagaram District.

Please take notice that the petitioners filed the above IA No: 746/2023 against the respondents for partition of the suit schedule property in to two shares by metes and bound by passing of final decree in pursuance of the preliminary Decree passed in the above said suit **Dt.20-03-2023.** In this regard, the Hon'ble Court was pleased to order notice to you through this publication notice by way of substituted service; if you have any objections/contentions you are requested to attend before the Hon'ble Court **at 10.30 a.m on 18-06-2024** either in person or through an Advocate with all your defenses and documents, failing which the matter will be decided exparte.

Sd/- By the order of the court
D.K.V.V.S.Ashwani Kumar
K.Vinay Kumar
Advocates
Opposite Judge Court
Visakhapatnam
Cell No.9032033945

Visakhapatnam
Date:12-05-2024

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 165/2019

Between: **చోడవరపు గౌరీశ్వరి** ...వాది.
And: **K.T. మోహన రావు** ...ప్రతివాది.
To,
D. **K.T. మోహన రావు,** తండ్రి క్రిష్ణ మూర్తి, గవర వీది, డొరు నెంబరు. 5-2-22/A, మహారాజ హస్పటల్ ఎదురుగా, గవర వీది, విజయనగరం పట్టణం, విజయనగరం జిల్లా.

<u>సమను</u>

పై నెంబరు దావాను ఇందలి వాది గారు ప్రతివాదిపై పైకోర్టులో దావాను దాఖలు చేసియున్నారు. పై నెంబరు దావాలోని ఇందలి ప్రతివాదికి తే 20-05-2024 ది న పై కోర్టు లో వాయిదా అయియున్నది. పైనెంబరు దావాలో ప్రతివాది అయిన మీరు **తే 20-05-2024 ది న ఉదయం 10-30 గం॥లకు** మీరు గానీ, మీ వలన ఆర్డరు పొందినవారు గానీ, మీ తరపున వకీలు గారు గానీ, పై కోర్టులో హాజరు అయి మీ తరపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై దావా మీ ప రోక్షమున తీర్మానం జరుగునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

// By court order //

గుల్లిపల్లి ఈశ్వర రావు
వాది తరుపు న్యాయవాది,
సాలూరు.

సాలూరు,
తేది: 12-05-2024.

విజయనగరం జిల్లాలో ఎన్నికల సిబ్బంది వివరాలు

సెక్టారు అధికారులు	225
నోడల్ అధికారులు	16
మైక్రో అబ్జర్వర్లు	445
పిఒలు	2276
ఎపిఒలు	2276
ఒపిఒలు	9106
బిఎల్ఒలు	1847
ఎంసిసి, ఇఇఎం టీములు	77
రిసీవింగ్, డిస్పాచ్ సిబ్బంది	728
వీడియో గ్రాఫర్లు	362



విజయనగరంలో ఏర్పాటుచేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

సదా ఓటర్ల సేవలో..

ఓటు వేయాలంటే గుర్తింపు కార్డు చూపించాల్సిందే

ఓటరు గుర్తింపు కార్డు లేని ఓటర్లు కింద తెలిపిన కార్డులలో ఏదో ఒక కార్డును గుర్తింపు కార్డుగా చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు

◆ ఆధార్ కార్డు ◆ఎం.ఎన్ ఆర్ ఇజిఎ (ఉపాధి హామీ) జాబ్ కార్డు ◆ పాస్ బుక్ (అభ్యర్థి ఫోటోతో బ్యాంకు, తపాల శాఖ జారీ చేసింది) ◆హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు (కేంద్ర కార్మిక శాఖ పథకం క్రింద జారీ చేసినది) ◆డ్రైవింగ్ లైసెన్స్ ◆పాన్ కార్డు ◆స్మార్ట్ కార్డు (కేంద్ర కార్మిక శాఖ పథకం క్రింద జారీ చేసినది) ◆పాస్ పోర్ట్ ◆ఫోటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్ ◆ సర్వీస్ ఐడెంటిటీ కార్డు (ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం/ రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన గుర్తింపు కార్డులు) ◆అధికారిక గుర్తింపు కార్డు (అఫిషియల్ ఐడెంటిటీ కార్డు) – (పార్లమెంటు సభ్యులు/ శాసన సభ్యులు/శాసన మండలి సభ్యులకు జారీ చేసిన గుర్తింపు కార్డులు) ◆యునిక్ డిజెబులిటీ ఐడి (యుడిఐడి)





కురుపాంలో ఎన్నికల విధులకు చిన్నారులతో కలిసి హాజరైన సిబ్బంది



సాలూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఒ విష్ణుచరణ్



శృంగవరపుకోటలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పి దీపిక

పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ స్టేషన్లు
పాలకొండ	1,95,020	287
కురుపాం	1,94,114	268
పార్వతీపురం	1,89,817	233
సాలూరు	2,04,489	243
మొత్తం	**7,83,440**	**1031**

విజయనగరం జిల్లాలో ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ స్టేషన్లు
విజయనగరం	2,57,205	260
రాజాం(ఎస్సి)	2,27,503	284
బొబ్బిలి	2,31,232	264
చీపురుపల్లి	2,05,484	257
గజపతినగరం	2,05,471	264
నెల్లిమర్ల	2,13, 551	248
శృంగవరపుకోట	2,22,475	270
మొత్తం	**15,62,921**	**1847**



ఇవిఎంలను తీసుకెళ్తున్న వాలంటీర్లు



పార్వతీపురంలో ఎన్నికల సామగ్రి పంపిణీకి హాజరైన సిబ్బంది



చీపురుపల్లిలో పత్రాలను సరిచూసుకుంటున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది



గజపతినగరంలో మెటీరియల్‌ను చెక్ చేస్తున్న సిబ్బంది



నెల్లిమర్లలో ఇవిఎంల కోసం వేచి ఉన్న సిబ్బంది



పాలకొండలో వేచి ఉన్న ఎన్నికల రిజర్వు సిబ్బంది

పోలింగ్ కేంద్రానికి వెళ్లేదెలా?



బానాది గ్రామంలో పొలాల్లో ఉన్న పోలింగ్ కేంద్రం

ప్రజాశక్తి–వేపాడ

వేపాడ మండలంలో బానాది సచివాలయ పరిధిలో సోమవారం జరిగే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వెళ్లాలంటే పంట పొలం గట్టే గతి. ఏ మాత్రం వర్షం పడినా ఈ గట్టు ద్వారా ఓటు వేయడానికి వెళ్లాలంటే నరకమే. సచివాలయ పరిధిలో బానాది, ఎం.సింగవరం గ్రామాలున్నాయి. రెండు చోట్లా ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. బానాది గ్రామంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రానికి వెళ్లాలంటే సిబ్బంది, ఓటర్లు సుమారు 800 మీటర్లు పొడవున ఇరుకుగా ఉన్న పొలం గట్టుమీద నడుచుకుంటూ వెళ్లాలి. ఎం.సింగవరం గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రాథమిక పాఠశాలలో తాత్కాలికంగా ఓటర్లు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా కర్రలతో రక్షణ ఏర్పాటు కంచె ఏర్పాటుచేశారు.



ఏర్పాటుచేసిన వైద్య శిబిరం



పార్వతీపురంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న సిబ్బంది



ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
సోమవారం
13 మే 2024

ఎర్రజెండాతోనే మన్యం అభివృద్ధి

- **దోపిడీని ఎదిరించి హక్కులు సాధించిన సిపిఎం**
- **తోటపల్లి పోరాటం రాష్ట్రానికే తలమానికం**
- **పీసా, 1/70 యాక్టు, అటవీహక్కుల చట్టం కమ్యూనిస్టుల చొరవే**
- **రైతులు, గిరిజనులు, ఉద్యోగులు, యువతకు అండగా అనేక పోరాటాలు**



అరకు, కురుపాం సిపిఎం అభ్యర్థులతో కలిసి అభివాదం చేస్తున్న కిశోర్‌చంద్రదేవ్ (ఫైల్)

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం గిరిజన ప్రాంతంలో 1960లోనే కమ్యూనిస్టు పార్టీకి బీజాలు పడ్డాయి. 1970లో కొన్ని కారణాలవల్ల సిపిఎం ఇబ్బందులు ఎదుర్కొన్నా 1980నాటికి పడిలేచిన కెరటంలా పార్టీ పునర్జీవం పోసుకుంది. దీంతో, గిరిజన ప్రాంతంలో ఉద్యమాలు క్రమంగా ఉపందుకున్నాయి. ఈ క్రమంలోనే 2004 ఎన్నికల్లో నాగూరు కేంద్రంగా ఉండే నేటి కురుపాం నియోజకవర్గం ప్రజానీకం సిపిఎం పార్టీకి పట్టం కట్టి ఎమ్మెల్యే స్థానాన్ని కల్పించారు. ఆ సందర్భంగా అసెంబ్లీలో పట్టుబట్టి పోరాడిందే నేడు అసంపూర్తిగా వున్న పూర్ణపాడు – లాబేసు వంతెన. అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం దీన్ని మంజూరు చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపిలకు చిత్తశుద్ధి లేకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో, నేటికీ విద్య, వైద్యం, నిత్యవసర సరుకుల కోసం నాగావళి నదిపై ప్రమాదపుటంచున్న పడవ ప్రయాణం చేయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. సాగు భూములపై గిరిజనులకు హక్కు కల్పించాలన్న దేశవ్యాప్త డిమాండ్‌ను సిపిఎం పార్వతీపురం మన్యం నుంచే ప్రారంభించింది. ఈ క్రమంలో ఏర్పడిందే 2005 అటవీహక్కు చట్టం. 2004 కమ్యూనిస్టుల మద్ధతుతో ఏర్పడిన యుపిఎ–1 ఈ చట్టాన్ని రూపొందించి, దాని ప్రకారం గరిష్టంగా 10ఎకరాల భూములకు సాగుపట్టాలిచ్చేందుకు ముందుకు వచ్చింది. మన్యం జిల్లాలో వేలాది ఎకరాల పోడు భూములకు ప్రభుత్వం ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చింది. ఆ తరువాత వచ్చిన టిడిపి, వైసిపిలకు చిత్తశుద్ధి కొరవడడంతో ఇంకా వేలాది గిరిజన కుటుంబాలు సాగు పట్టాలకు నోచుకోలేదు. ఏజెన్సీకి ఆనుకుని అత్యధిక గిరిజనులు నివాసం ఉంటున్న గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని దశాబ్దాలు తరబడి పోడుతోంది. 2005 ఏప్రిల్‌లో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన తోటపల్లి నిర్వాసితుల పోరాటం దేశానికే ఆదర్శంగా నిలిచింది. అప్పటి ప్రభుత్వం 5ముంపు గ్రామాలుగా ప్రకటిస్తే సిపిఎం చేసిన సుదీర్ఘపోరాటంతో 24గ్రామాలకు ముంపు సమస్య ఉన్నటుగా గుర్తించి మెరుగైన నష్టపరిహారం చెల్లించారు. ప్రస్తుతం అనేక ప్రాజెక్టుల నిర్వాసిత గ్రామాల్లో 18ఏళ్ల నిండినవారందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందుతుందంటే నాడు సిపిఎం ఆధ్వర్యాన తోటపల్లిలో చేపట్టిన ఉద్యమమే కారణం. జలాశయానికి వందమీటర్ల దూరంలోవున్న గ్రామాలను ముంపు ప్రాంతంగా గుర్తించే జీవో కూడా అప్పుడే రూపకల్పన జరిగింది. పెద్దగెడ్డ ముంపు గ్రామాలను 1నుంచి 5రెట్లకు పెరిగేలా చేయడంతోపాటు నిర్వాసితులందరికీ న్యాయం జరిగే విధంగా పోరాడింది. ఇప్పటికీ కొంతమందికి పూర్తి న్యాయం జరగకపోవడంతో పోరాటం కొనసాగిస్తోంది. ప్రస్తుతం కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ భూ నిర్వసితులకు న్యాయం చేయాలని పోరాడుతోంది. కొమరాడ మండలం కోటిపాం ప్రాంతంలో కాలుష్యకారక థర్మల్ విద్యుత్ కర్మాగారానికి వ్యతిరేకంగా పోరాడి నిలువరించగలిగింది. నాడు ఇందుకోసం సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాడుతోంది. గిరిజనులు సాగుచేసుకుంటున్న పాచిపెంట మండలం కుడుమూరులోని మొకాసా భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోవడాన్ని నిలువరించింది. దీంతో, ప్రస్తుతం ఆయా భూములన్నీ గిరిజనుల ఆదీనంలో వున్నప్పటికీ పాలకులు నేటికీ ఆక్రమణ దారులకు కొమ్ముకాస్తునే ఉన్నారు. గరుగుబిల్లి మండలం పోలినాయుడు వలసలో 1200ఎకరాల ఇనాం భూములను పెత్తదారులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడంతో పెద్దఎత్తున పోరాడింది. మెంటాడ మండలం గిరిజనుల సాగులోవున్న వందలాది ఎకరాలను గిరిజనేతర పెత్తందారులు ఆక్రమిత చర్యలను అడ్డుకుని పట్టాల కోసం పోరాడుతోంది. సిపిఎం పోరాటంతో సాలూరు శిఖపరువులో అక్రమంగా తలపెట్టిన మాంగనీస్ తవ్వకాలు, మండలంలోని తామరకొండ, పార్వతీపురం మండలంలోని బోడికొండపై గ్రానైట్ తవ్వకాలు నిలిపివేయాలని గిరిజనులు, గిరిజనేతరులను పెద్ద ఎత్తున కదిలించి పోరాడింది. సవర భాషా విద్యావాలంటీర్లను కొనసాగించాలని, జీవో నెంబర్ 3ను పునరుద్ధరించి గిరిజన ప్రాంతంలో 100శాతం ఉద్యోగాలను గిరిజనులతో భర్తీ చేయాలని పోరాడుతోంది. రేషనలైజేషన్ పేరుతో 3కిలో మీటర్ల పరిధిలోవున్న 30మంది విద్యార్థుల కన్నా తక్కువగా ఉన్న స్కూళ్లను మూసివేయాలన్న చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా మన్యంలో సిపిఎం తిప్పి కొట్టింది. పార్వతీపురంలోని వెంకటేశ్వర డిగ్రీ కాలేజీని ప్రభుత్వరంగంలోకి విలీనం చేయాలన్న డిమాండ్‌తో సిపిఎం చేసిన సుదీర్ఘపోరాటం ఫలించింది. నేడు ఆ కాలేజీయే పేద, గిరిజనులకు చదువుల తల్లిగా మారింది.

అరకు అనంతగిరి ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను అడ్డుకోవడంతో విజయనగరం జిల్లా ఎస్.కోట గిరిజన ప్రాంతానికి ఆనుకునివున్న జిందాల్ అల్యూమినా కంపెనీ నిర్మాణం జరగలేదు. దీంతో, అప్పట్లో భూములు కోల్పోయిన గిరిజనులకు తిరిగి అప్పగించాలని సిపిఎం పోరాడుతోంది. ఇలా ఎన్నో సమస్యలపై పోరాడింది. విజయాలు సాధిస్తోంది. మరిన్ని సమస్యల పరిష్కారానికి పోరాడుతునే ఉంది. తాజా ఎన్నికల్లో అరకు పార్లమెంట్ స్థానం, దాని పరిధిలోవున్న కురుపాం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థులు పోటీకి దిగడంతో ఆ పార్టీ చరిత్ర, పోరాటలు జనంలో చర్చనీయాశంగా మారుతున్నాయి.

ఎర్రజెండాతోనే పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధి సాధ్యమౌతుంది. 1960 దశకం నుంచి చేసిన అనేక పోరాటాలు, ఫలితాలే ఇందుకు తార్కాణంగా చెప్పకోవచ్చు. గిరిజన రైతాంగ దోపిడీని ఎదురించడం మొదలుకుని గిరిజనులు, రైతుల కోసం ఇక్కడి నుంచే కమ్యూనిస్టు ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. అటు పార్లమెంట్, ఇటు అసెంబ్లీల్లో చర్చనీయాంశమై చట్టరూపం దాల్చాయి. అవే చట్టాలను గడిచిన పదేళ్లలో బిజెపి కాలరాస్తోంది. బిజెపికి, టిడిపి, వైసిపి వంతపాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థుల విజయంతోనే చట్టాల పరిరక్షణ సాధ్యమౌతుంది. ఇందుకనుగుణంగా కురుపాం సిపిఎం అసెంబ్లీ అభ్యర్థి మండంగి రమణను, అరకు సిపిఎం ఎంపీగా పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలంటూ మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ సైతం ఇటీవల పిలుపునిచ్చారు.

ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు



తన ఇంటిపై రమణ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి–శృంగవరపుకోట

పట్టణానికి చెందిన దొగ్గ రమణ హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన చిరంజీవి ఫ్యాన్స్ మండల అధ్యక్షులు కూడా. ఆదివారం తన ఇంటి గోడపై 'ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు, ఓటుకు నోటు మాకొద్దు' అని ప్రింటింగ్ చేసిన ఫ్లెక్సీని అంటించాడు. రమణ చర్యను అందరూ ప్రశంసిస్తున్నారు. అటువైపు వెళ్లే వారు ఆ ఫ్లెక్సీని చూసి ఆయన్ను అభినందిస్తున్నారు. ప్రతిఒక్కరూ ఇలా చేస్తే ప్రజల సొమ్మును దోచుకునే నాయకులపై తిరగబడొచ్చని చెబుతున్నారు.

అభ్యర్థులకే ఓటు లేదు





ప్రజాశక్తి–చీపురుపల్లి

తాజా మంత్రి బొత్స సత్యన్నారాయణ, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో తాము ఓటు వేసుకోలేని పరిస్థితి నెలకొంది. 2004 నుండి చీపురుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బొత్స సత్యన్నారాయణ చీపురుపల్లి నియోజకవర్గంలో తన ఓటు గాని తన కుటుంబ సభ్యుల ఓట్లుగాని నమోదు చేసుకోలేదు. బొత్స చీపురుపల్లి నుండి పోటీ చేస్తుండగా తన ఓటు మాత్రం విజయనగరంలో ఉంది. అలాగే ఆఖరి నిమిషంలో చీపురుపల్లి నియోజకవర్గం నుండి టిడిపి తరుపున పోటీ చేస్తున్న కిమిడి కళావెంకటరావు ఓటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఉంది. దీంతో తాజా మంత్రి మాజీ మంత్రులు ఇద్దరు తమ ఓటుని తమకు వేసుకునే పరిస్థితి లేకుండా పోయింది.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నరసింహమూర్తి

350 మందిపై బైండోవర్

మావోయిస్టు ప్రభావిత గ్రామం గుర్తింపు

ప్రజాశక్తి - మక్కువ

ఎన్నికల సందర్భంగా మండలంలోని 53 పోలింగ్ స్టేషన్‌లో ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా 350 మందిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు మక్కువ ఎస్ఐ వి నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం ఎన్నికల సందర్భంగా ఏజెన్సీ గ్రామాలైన దిగువ మెండంగి, ఆల గురువు పోలింగ్ కేంద్రాలను తన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఏ వెంకంపేట, సంబర, డీసెర్లం గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామన్నారు. చిలక మెండంగి గ్రామాన్ని నక్సల్స్ ప్రభావిత గ్రామంగా గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 144 సెక్షన్ అమలులో ఉందని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకూ తావివ్వకుండా ఓటింగ్ సక్రమంగా జరిగేలా రాజకీయ నాయకులు ప్రజలంతా సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఖచ్చితంగా నివేదికలు అందజేయాలి

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట, టౌన్

పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలను ఖచ్చితమైన వివరాలతో, వేగంగా అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థపై ఆదివారం రాత్రి సమీక్షించారు. అక్కడి అధికారులు, సిబ్బంది ఎన్నికల రోజు చేయాల్సిన విధులు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఆదివారం రాత్రికే అన్ని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయించాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్ గుర్తింపు కార్డులకు సంబంధించి, ఎలా ఓటు చేయాలి తదితర వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలు ఎంతో కీలకమని, ఖచ్చితమైన సమాచారంతో వేగంగా వాటిని రూపొందించి అందజేయాలని సూచించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ జరిగేలా అన్ని పోలింగ్ కేంద్రాల సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. మాక్ పోల్ పూర్తి అయినట్లు అన్ని పోలింగ్ కేంద్రాలనుంచి నివేదికలు తెప్పించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉదయం 7 గంటలకే అన్ని కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభం అయినట్లు కూడా రిపోర్టులు తెప్పించాలని చెప్పారు. ఉదయం 9 గంటలు నుంచీ ప్రతీ 2 గంటలకు ఓటింగ్ శాతాన్ని తీసుకోవాలని, పోలింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఈ వివరాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎస్‌డి అనిత, ఎన్నికల రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఇన్‌ఛార్జి, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించిన కలెక్టర్

వెబ్ కాస్టింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆదివారం రాత్రి కంట్రోల్ రూమును ఆమె సందర్శించారు. జిల్లాలోని 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో సహా మొత్తం 1136 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. దీనికోసం 2272 సిసి కెమేరాలను అమర్చారు. వీటి ద్వారా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుంచే పరిశీలించనున్నారు. కంట్రోల్ రూములో నియోజకవర్గాల వారీగా వెబ్ కాస్టింగ్ కోసం ఏర్పాటు చేసిన ఏడు టివిల్లో, పోలింగ్ బూత్‌ల కార్యకలాపాలను కలెక్టర్ తిలకించారు. పోలింగ్ రోజు ఎక్కడా ఎటువంటి సాంకేతిక సమస్యా తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సర్వం సిద్ధం


బొబ్బిలి : ఇవిఎంపై సిబ్బందికి వివరిస్తున్న అధికారి

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 2,31,232 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. 264 పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

మహిళలదే పైచేయి

ఎన్నికల్లో మహిళలదే పైచేయి కానుంది. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువ మంది ఉండటంతో విజేతను నిర్ణయించేది కూడా వారే. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. నియోజకవర్గంలో 2,31,232 మంది ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 1,17,006 మంది ఉన్నారు. పురుషులు 1,14,216 మంది ఉన్నారు.

ప్రలోభాలు

ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. మున్సిపాలిటీలో ఓటుకు రూ.1,500 ఇవ్వగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.వెయ్యి ఇస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇద్దరు కూడా సమానంగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయడంతో ఓటర్లు ఎవరు వైపు మొగ్గుచూపుతారోనని చర్చ సాగుతోంది. డబ్బులు పంచడంతో ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు కులం కార్డు ఉపయోగించడం, గతంలో తాము చేసి సహాయాన్ని చెప్పి లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

శృంగవరపుకోట : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోష్‌కుమారి కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఓటు వజ్రం కంటే విలువైనదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు ద్వారా ప్రజలకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవచ్చునని తెలిపారు.

ఓటు వేయాలంటే 15 కిలోమీటర్లు వెళ్ళాల్సిందే

భోగాపురం: విమానాశ్రయ నిర్వాసిత గ్రామాల ఓటర్లు ఓటు వేయాలంటే 15 కిలో మీటర్లు వెళ్ళాల్సిన పరిస్థితి


భోగాపురం: ఇటీవల వెలిసిన మరాడ పాలెం

ఏర్పడింది. రెండు గ్రామాలకు చెందిన సుమారు 460 మంది ఓటర్లు ఇబ్బంది పడనున్నారు. సంబంధిత పార్టీ నాయకులు మాత్రం వారు వెళ్లేందుకు ఇప్పటికే ఆటోలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా కవులవాడ పంచాయతీలోని మరడపాలెం, బైరెడ్డి పాలెం పంచాయతీలోని ముడసర్ల పేట గ్రామాలను సుమారు 15కిలో మీటర్ల దూరంలో ఉన్న లింగాలవలస కొండపైకి తరలించారు. వీరందరు ఇక్కడ ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఎటువంటి పోలింగ్ కేంద్రాలనూ అధికారులు కేటాయించలేదు. దీంతో ముడసర్ల పేట గ్రామానికి చెందిన 60 మంది ఓటర్లు, మరడపాలెం గ్రామానికి చెందిన 400 మంది ఓటర్లు తమ పాత పంచాయతీల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాల్సిన వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. వీరందర్ని ఆటోల్లో తరలించేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు.

సెంటర్ లైటింగ్ పై పర్యవేక్షణేది?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గతేడాది అమ్మవారి పండగకు నెల రోజుల ముందు పట్టణ ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాలకు ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేసిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు అవి మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. జిల్లా కేంద్రంలో గత ఏడాది పట్టణంలో ఉన్న ఇప్పల పోలమ్మ, ఎర్రకంచెమ్మ అమ్మవార్ల పండగను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ పాలకవర్గ కౌన్సిల్ సభ్యుల ఆమోదం మేరకు గత ఏడాది ఏప్రిల్‌లో రూ.10లక్షలు సాధారణ నిధులతో ప్రధాన రహదారి మధ్యలో ఉన్న

అంధకారంలో పట్టణ ప్రధాన రహదారి


అరకొరగా వెలిగిన సెంటర్ లైటింగ్

డివైడర్‌లో ఉన్న విద్యుత్ స్తంభాల చుట్టూ ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు టెండర్లను పిలిచారు. విద్యుత్ కాంతులతో పట్టణానికి ప్రత్యేక శోభను తీసుకురావడంతో అమ్మవారి పండగ చూసేందుకు వచ్చిన వారు సంతోషం వ్యక్తం చేశారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేసిన కొన్ని నెలలకే ఎప్పటికప్పుడు లైట్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు గానీ, సిబ్బంది గానీ చూసీ చూడనట్లు వ్యవహరించడంతో డివైడర్ మధ్యలో కొన్ని స్తంభాలకు లైట్లు వెలిగి, కొన్ని విద్యుత్ స్తంభాలకు వెలగక దిష్టి బొమ్మల వలె దర్శనమిస్తున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేసి ఎల్ఇడి లైట్లు వెలిగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు ఓటుతో సిద్ధమయ్యారు

ప్రజాశక్తి-బొబ్బిలి

అరాచక పాలన అంతం చేసేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారని మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓటు అనే ఆయుధాన్ని ప్రయోగించి దుష్ట శక్తి భరతం పట్టనుందని అన్నారు. రాష్ట్రమంతా చంద్రబాబు పాలన కావాలని కోరుకుంటోందన్నారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు కోసం యువత, సాగునీరు కోసం రైతులు, ధరలు నియంత్రణ కోసం మధ్యతరగతి వర్గాలు, సంక్షేమం కోసం బడుగు వర్గాలు అభివద్ధి కోసం జనమంతా చంద్రబాబును కోరుకుంటున్నారని తెలిపారు. జగన్ సర్కార్ కుట్రలు, కూల్చివేతలు, కబ్జా బాగోతాలు, చేతకాని పాలన రాష్ట్ర అభివృద్ధికి శరాఘాతంగా మారిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. విజయనగరం జిల్లాలో తెలుగుదేశం అత్యధిక స్థానాలను కైవసం చేసుకోనుందని అన్నారు.

మూలకు చేరిన సచివాలయ సామగ్రి

ప్రజాశక్తి - వీరఘట్టం

2019లో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో సచివాలయాల వ్యవస్థ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మండలంలోని 34 పంచాయతీల ఉండగా జనాభా ప్రాతిపాదికన 2000 జనాభా ఉంటే సచివాలయంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఇలా 24 సచివాలయాలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామాల్లో పూర్తిస్థాయిలో సచివాలయ భవనాలు లేకపోయినప్పటికీ లక్షలాది రూపాయలతో సచివాలయానికి కావాల్సిన సామాగ్రిని అప్పట్లో సరఫరా చేశారు. వీరఘట్టం మండల కేంద్రంలోని నాలుగు సచివాలయాలు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడా సచివాలయ భవనాలు పూర్తి చేయలేదు. ప్రస్తుత వీరఘట్ట మేజర్ పంచాయతీ ఉన్న భవనంలో నాలుగు సచివాలయాలుగా ఏర్పాటు చేసి అందులో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. సచివాలయాలనికొచ్చిన సామాగ్రిని ఎక్కడ పెట్టేందుకు వీల్లేకపోవడంతో లక్షలాది రూపాయలు విలువ చేసే బీరువాలను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాల భాగంలోనే పాడైపోయిన భవనంలో నాలుగున్నర ఏళ్లుగా మగ్గిపోతున్నాయి. లక్షలాది రూపాయలు విలువ చేసే బీరువాలు మూలనపడి ఉండడంతో ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. బీరువాలు పాడైపోక ముందే అర్ధాంతరంగా ఉన్న సచివాలయ భవనాలు పూర్తిచేసేలా వినియోగంలోనికి తీసుకురావాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.


మూలకు చేరిన సామగ్రి ఇదే..

సమరానికి సై

ప్రజాశక్తి-పాలకొండ

సార్వత్రిక ఎన్నికలు రానే వచ్చాయి. సోమవారం బరిలో ఉన్న అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవటాని సమరానికి సిద్ధమయ్యారు. ఓటర్లు తీర్పు ఇచ్చే రోజు రానే వచ్చింది. పాలకొండ నియోజకవర్గ పరిధిలో 1,95,020 మంది ఓటర్లు ఉన్నారు. బరిలో ఏడుగురు అభ్యర్థులు ఉండగా, జనసేన, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. 2014,19 ఎన్నికల్లో విజయం సాధించిన వైసిపి అభ్యర్థి కళావతి ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. అలానే 2014,19 ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసి ఓటమి చెందిన జయకృష్ణ ఈ ఎన్నికల్లో జనసేన తరపున బరిలో నిలిచి ఈసారి ఎలా గైనా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఓటర్లను ఆకట్టుకొనే పనులతో పాటు రాజకీయ చదరంగంలో పావులు కదిపి గెలవాలని ఇరువురు భావిస్తున్నారు. నాలుగు మండలాల్లో కూడా ఓటర్లను తమకు అనుకూలంగా మలచుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఇద్దరీ ప్రధాన దృష్టి కూడా సీతంపేట మండలంపైనే ఉంది. సీతంపేట మండలంలోని ఓటర్లను తమ వైపుకు లాక్కోవలని ఇరు పార్టీ అభ్యర్థులూ చాప కింద నీరులా ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ తరపున బరిలో ఉన్న సవర చంటిబాబు సీతంపేట మండలానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు ఏజెన్సీలో కాంగ్రెస్‌కు ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకు తమకు లభిస్తుంది అని ఆయన భావిస్తున్నారు. ఏజెన్సీలో సిపిఎంకు ఉన్న ఓటింగ్‌తో పాటు ట్రేడ్ యూనియన్లు బలంగా ఉండటం కూడా తమకు అనుకూలం అని చెప్తున్నారు. ఏది ఏమైనా ఓటర్ల తీర్పు ఏ విధంగా ఉందో వేచి చూడాల్సిందే.

ప్రజాశక్తి
సోమవారం 13 మే 2024

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

ఓటింగ్ కు వేళయింది. ఐదేళ్లకొకసారి వచ్చే అతి పవిత్రమైన, ముఖ్యమైన ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. సోమవారం జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మ వలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో 137 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 268 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గం పరిధిలో 1,94114 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 94,336, మహిళా ఓటర్లు 9,9736, థర్డ్ జెండర్ 42 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక్కొక్క కేంద్రానికి ఆరుగురు సిబ్బందిని ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నియమించారు. నియోజకవర్గం మొత్తం 1608 మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. మరో 300 మందిని రిజర్వులో ఉంచారు. 39 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ పోలింగ్ పటిష్టంగా నిర్వహించేందుకు పోలీస్ బందోబస్తుతో 144 సెక్షన్ అమల్లోకి తీసుకువచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని ఆర్టీసీ బస్సుల్లో శనివారం మధ్యాహ్నం పంపించి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది.

కురుపాం జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లను రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 44మంది సెక్టోరియల్ అధికారులు ఆదివారం నుంచి 268పోలింగ్ కేంద్రాలుకు ఇవిఎంలను, ఇతర సామాగ్రి కౌంటర్ల వారీగా సిబ్బందికి అందజేశారు. అనంతరం రవాణా కోసం ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఎన్నికలు సామగ్రి పంపిణీ ,భోజన సౌకర్యాలు, త్రాగు నీరు, మెడికల్ , రవాణా సౌకర్యాలు ను రిటర్నింగ్ అధికారి వివి రమణ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికలు కమీషన్ నిబంధనలు పాటిస్తూ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

పార్వతీపురంరూరల్ : స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిని ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం నుండి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తరలి వెళ్లాయి. నియోజకవర్గంలో 233 పోలింగ్ కేంద్రాల్లో జరగబోయే ఈ ఎన్నికల్లో దాదాపు 1600మందికి పైగా సిబ్బంది పాల్గొననున్నారు. దీనికితోడు 350 మంది పోలీసు సిబ్బంది, ఒక కంపెనీ సిఆర్‌పిఎఫ్ దళాలు శాంత్రిభద్రతల పర్యవేక్షణ చేయనున్నారు. సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా భోజన వసతులు ఏర్పాటు చేసామని ఆర్‌ఒ కె.హేమలత తెలిపారు. 1,89,817 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 37 రూట్‌లు, 33 సెక్టార్లలో జరుగుతుందని, ఎన్నికల సామాగ్రి రవాణా నిమిత్తం 65 బస్సులు వినియోగిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 103 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీసుల సహకారంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోనూ ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, అలాగే వికలాంగులు, గర్భిణులకు సౌకర్యవంతంగాఓటింగ్‌లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

పాలకొండ : నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామాన్లు అధికారులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాల్లో 1,95,020 మంది ఓటర్లు ఉన్నారు. అందుకు గాను 287మంది పిఒలు, 287మంది ఎపిఒలు, 287మంది ఒపిఒలు ఉన్నారు. 35మంది సెక్టర్ అధికారులను నియమించి 35సెక్టర్లుగా విభజించారు. 142కేంద్రాల్లో వెబ్ కాస్ట్ తో ఏర్పాటు చేశారు. అలాగే పాలకొండ మండలంలో టిడిపారాపురం, అంపిలి, అవళింగి, వీరఘట్టం మండలంలో గంగంపేట, తూడి, భామిని మండలంలో మనిగ, బత్తిలి గ్రామాలను అతిసమ సాత్విక గ్రామాలుగా గుర్తించారు. ఇక్కడ కేంద్ర బలగాలను ఏర్పాటు చేశారు. పార్వతీపురం దిశా డీఎస్పీ హర్షితచందన ఎన్నికల నిర్వహణ పర్యవేక్షిస్తున్నారు. ఆరుగురు సిఐలు, 20 మంది ఎస్సైలు, 400 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. కేంద్ర బలగాలు 100 మంది, స్ట్రైకింగ్ ఫోర్స్ 16 మంది, ఆక్టోపస్ 50 మంది, విశ్రాంతి ఆర్మీ 16 మంది, విశ్రాంతి పోలీసులు 15 మంది, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి 108 మంది గట్టి బందోబస్తు చేపట్టనున్నారు.



పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

అరకొర ఏర్పాట్లు

ఎన్నికల సామాగ్రి తీసుకొచ్చే ఉద్యోగులకు ఇబ్బందులు తప్పలేదు. ఎండ తీవ్రంగా ఉండడంతో నీటికి కటకటలాడారు. పూర్తి స్థాయిలో నీటి సదుపాయం కనిపించకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. అదేలా మధ్యాహ్నం భోజనం కూడా పార్సిల్ చేసి ఇచ్చినప్పటికీ సరైన మోతాదులో ఇవ్వలేదని ఉద్యోగులు ఆరోపించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు : ఆర్‌ఒ

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం దగ్గర విలేకరులతో మాట్లాడుతూ 287పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎన్నికలు సజావుగా జరిగేలా దృష్టి పెట్టామన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, పోలింగ్ కేంద్రాల దగ్గర బిఎల్‌ఒలను నియమించి, అక్కడ టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయం కూడా కల్పిస్తున్నామని చెప్పారు. 142 కేంద్రాలను గుర్తించి నిఘా కెమెరాల ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సోమవారం ఉదయం 5:30గంటలకు పోలింగ్ కేంద్రాల దగ్గర మాక్ పోలింగ్ చేపడతామని, పోలింగ్ ఏజెంట్లు అందరు హాజరు కావాలని కోరారు. పోలీసు బందోబస్తు సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలింగ్ తక్కువ జరిగిన కేంద్రాల దగ్గర దృష్టి పెట్టి బిఎల్‌ఒలు, ఇతర తమ సిబ్బంది ఓటర్లను తీసుకొచ్చేలా చూస్తామన్నారు.

వర్షంతో ఇవిఎంల పంపిణీకి స్వల్ప ఆటంకం

ప్రజాశక్తి - సాలూరు

సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నిర్వహించనున్న పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆర్వో విష్ణు చరణ్ పర్యవేక్షణలో నియోజకవర్గంలోని 243 పోలింగ్ కేంద్రాల కు ఇవిఎంలను పంపిణీ చేశారు. ఉదయం అరగంట పాటు వర్షం పడడంతో ఇవిఎం పంపిణీకి కొంత ఆటంకం ఏర్పడింది. ఆ తర్వాత యధావిధిగా ఇవిఎంల పంపిణీ జరిగింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సిబ్బందికి ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఇవిఎంలు తీసుకుని పోలింగ్ సిబ్బంది నిర్దేశించిన పోలింగ్ కేంద్రాల కు బస్సుల్లో తరలివెళ్లారు.



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని 62 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం చేరుకున్నారు. అయితే కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి ముందస్తుగా మౌలిక సదుపాయాలు మంచినీరు, బాతురూమ్, లైటింగ్ ఏర్పాట్లు చూస్తున్నట్లు బూత్ అధికారులు తెలిపారు. పోలింగ్ నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టారు.

పార్వతీపురం టౌన్: పట్టణంలో ఏర్పాటు చేసిన 35 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో ఈవీఎంలు ఎన్నికల సామాగ్రితో పట్టణంలో గల పలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



తాగునీటికి అవస్థలుపడుతున్న సిబ్బంది

ఎన్నికల ఉద్యోగుల అగచా(పా)ట్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల విధుల్లో పోలింగ్ నిర్వహణ సామాగ్రి కోసం ఆదివారం కురుపాం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు వచ్చిన ఉద్యోగులకు పాట్లు తప్పలేదు. ఉద్యోగులు చంటి బిడ్డలతో ఎన్నికల విధులకు హాజరయ్యారు. కౌంటర్ల వద్ద తగినన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఉక్క పోతతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోవైపు తాగునీరు చాలక దాహార్తితో ఇబ్బందులు పడ్డారు. తప్పని పరిస్థితిలో బయటికు వెళ్లి కొనుక్కోవాల్సి వచ్చింది. పోలింగ్ ప్రశాంత నిర్వహణకు పెద్ద సంఖ్యలో కేంద్ర పోలీసు బలగాలను ఆయా ప్రాంతాలకు పంపిస్తున్నట్లు పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు, సిఐ సత్యనారాయణ తెలిపారు.

ఓటుకు వెయ్యి పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొన్న నేపథ్యంలో అభ్యర్థులిద్దరూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. గ్రామాల్లో ఓటుకు 300 నుంచి 500 వరకు పంపిణీ చేశారు. పట్టణంలో ఓటుకు 500 నుంచి వెయ్యి రూపాయల వరకు పంపిణీ చేశారు. శుక్రవారం నుంచే ఓటర్లకు ప్రలోభాల వల విసిరారు. వైసిపి, టిడిపి పార్టీ తరపున పని చేస్తున్న కార్యకర్తలకు మద్యం పంపిణీ పూర్తి స్థాయిలో జరుగుతోంది. పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం షాపుల బంద్ చేసినప్పటికీ విచ్చలవిడిగా లభ్యమవుతోంది. పట్టణంతో పాటు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ విధించారు.

సొంత ఊర్లకు తరలివచ్చిన ఓటర్లు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఓటేసేందుకు పార్వతీపురం పరిసర గ్రామాలకు దూర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, ఉపాధి పనులకు వెళ్లిన వారు పెద్దఎత్తున తరలివస్తున్నారు. గ్రామాల్లో ఎన్నికలలో పాల్గొనడం అనేది ఒక హోదాగానూ, గౌరవంగానూ భావించే గ్రామీణులు తమ కుటుంబీకులను తప్పక ఓటువేసేందుకు రావాలని ఒత్తిడి చేయడంతో సోమవారం ఉదయం నుంచే తరలి వస్తున్నారు. విశాఖపట్టణం నుండి రాయగడ వెళ్లే ట్రైన్‌లకు పార్వతీపురం మండలం నరిసిపురంలో రిక్వెస్ట్ హాల్టు ఉండడంతో రాయపూర్ పాసింజర్, రాయగడ గుంటూరు పాసింజర్లో ఓటర్లు తరలి రావడంతో స్టేషన్‌లో రద్దీ వాతావరణం ఏర్పడుతుంది. ఇది ఉండగా ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

రిసెప్షన్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సామాగ్రి స్వీకరణ, లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు ప్రమోద్ కుమార్ మొహర్ధ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఉద్యాన కళాశాలలో ఎన్నికల సామాగ్రి స్వీకరణ రిసెప్షన్ కేంద్రానికి సంబంధించి ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నాలుగు నియోజక వర్గాలకు వేర్వేరుగా కేటాయించిన శిబిరాల్లోని కౌంటర్ల వద్ద టేబుళ్లు, కుర్చీల ఏర్పాటును, పోలింగ్ అనంతరం పిఒలు, ఎపిఒ ల స్క్రూటినీ, స్వీకరణకు కల్పించిన వసతులు, తదితర అంశాల ఏర్పాట్లపై కలెక్టర్ వివరించారు. అలాగే లెక్కింపు కేంద్రాల వద్ద బారికేడ్లు, గోడలకు మెస్ ఏర్పాటును నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల సామాగ్రి స్వీకరణ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇవిఎంల భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా, పర్యవేక్షణ కోసం వసతి కల్పనను చూశారు. స్ట్రాంగ్ రూమ్ వద్దకు సులువుగా చేరుకొని రాక పోకలకు అంతరాయం కలగకుండా కళాశాల ముందు భాగంలో అనువైన బస్‌ల పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేసి అదే స్థలంలో బస్‌లను నిలిపివేయనున్నట్టు తెలిపారు. అనంతరం కేటాయించిన ప్రతి విభాగాన్ని సందర్శించారు.



లెక్కింపు కేంద్రం ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిశీలకులు ప్రమోద్‌కుమార్ మొహర్ధ, కలెక్టర్

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, కోట

జిల్లాలో సోమవారం జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికల పోలింగ్ సాఫీగా జరిగేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం చేరుకున్నారని, భోజన విరామం అనంతరం వారంతా ఎన్నికల మెటీరియల్‌తో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలన్నింటిలో నీడ, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి కనీస వసతులను కల్పించడం జరిగిందన్నారు. ఆదివారం ఎన్నికల సామాగ్రి పంపిణీని పరిశీలించే నిమిత్తం చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, గజపతినగరం, విజయనగరంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో సామాగ్రి అందిస్తున్న తీరును తెలుసుకున్నారు. ఆయా సిబ్బందితో మాట్లాడి పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామాగ్రి అంతా స్వీకరించిందీ లేనిదీ ఆరా తీశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తనిఖీ చేసిన తర్వాతే తీసుకువెళ్లాలని సూచించారు. సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లో జాప్యం చేయకుండా ఆయా పోలింగ్ కేంద్రాలకు త్వరగా చేరుకొని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి, జె.సి. కార్తీక్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా విజయనగరంలోని పోలీస్ శిక్షణ కళాశాలలో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి ఆయా కేంద్రాల్లో వీడియోగ్రఫీ, వెబ్‌కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ల నియామకం వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోందని, జిల్లాలోని ఓటర్లు పెద్ద ఎత్తున తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పంపిణీ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

జిల్లాలో ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను (డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్) జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం పరిశీలించారు. గరివిడి మండలం శ్రీరాంనగర్‌లోని దుర్గాప్రసాద్ సరాఫ్ ఆర్ట్స్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన చీపురుపల్లి నియోజకవర్గ పంపిణీ కేంద్రం, రాజాంలోని ప్రభుత్వ ఐటిఐ, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజయనగరం పోలీసు శిక్షణా కళాశాలలో ఏర్పాటు చేసిన ఆయా నియోజకవర్గాల పంపిణీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కౌంటర్లను పరిశీలించారు. కేంద్రాల్లోని సిబ్బంది పనితీరు, వసతులను ఆరా తీశారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారు ఎక్కడా ఇబ్బంది పడకుండా చూడాలని, అన్ని విధాలా వారికి పూర్తి సహకారాన్ని అందించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు బి.శాంతి, ఎల్.జోసెఫ్, ఎ.సాయిశ్రీ, ఎం.వి.సూర్యకళ, జెసి కె.కార్తీక్‌లకు కలెక్టర్ సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ పంపిణీ కేంద్రంలో పక్కా ఏర్పాట్లు చేశారు. ముందుగా రిజిస్ట్రేషన్ కౌంటర్లలో సిబ్బంది హాజరును తీసుకున్నారు. వారికి డ్యూటీ ఆర్డర్లను అందజేశారు. ఇవిఎంలు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయడానికి ఒక్కో చోట పదికి పైగా కౌంటర్లను ఏర్పాటు చేశారు. వచ్చినవారికి వచ్చినట్లే, ఎటువంటి క్యూలైన్లు లేకుండా వెంటవెంటనే ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఎన్నికల సిబ్బందికి సహాయం కోసం హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. మైక్‌ల ద్వారా నిరంతరం పలు సూచనలు చేశారు. అలాగే మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్స్, ట్రైనింగ్ సెంటర్, రిజర్వ్ స్టాఫ్ కౌంటర్, వాహనాల కేటాయింపు కోసం కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రతీ పంపిణీ కేంద్రం వద్దా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, అవసరమైన వారికి వైద్య సేవలను అందించారు. పోలింగ్ సిబ్బంది తమకు ఇచ్చిన ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రితో, బృందాలుగా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పయనమయ్యారు.



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్‌పి దీపికా పాటిల్

విధుల్లో అలసత్వం వద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. విధుల్లో అలసత్వం వద్దని పోలీసు సిబ్బందికి సూచించారు. ఆదివారం పోలీసు అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, ఎక్స్ సర్వీస్‌మెన్, పోలింగు కేంద్రాలు వద్ద, రూట్ మొబైల్స్ నిర్వహించాల్సిన బందోబస్తు విధులు, భద్రత గురించి నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలో దిశా నిర్దేశం చేశారు ఎన్నికల విధుల్లో ఎటువంటి అలసత్వం వద్దని, పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలని, 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇంకెవ్వరూ ఉండకుండా చూడాలని, 200 మీటర్లు దూరంలోనే ఓటర్ల వాహనాలను నిలిపి వేయాలని, ప్రశాంతయతంగా ఎన్నికల నిర్వహణకు కృతనిశ్చయంతో పని చేయాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే సంబధిత అధికారులకు సమాచారం అందించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో భోగాపురం సిఐలు వెంకటేశ్వరరావు, రవికుమార్, పలువురు ఎస్సైలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిఖపరువు పోలింగ్ కేంద్రాన్ని వచ్చిన పట్టుచెన్నూరు, పగుల చెన్నూరు గ్రామాల గిరిజనులు

కొటియా ఓటర్లపై గురి

కిందకు దించేందుకు సన్నాహాలు

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాలకు సంబంధించిన ఓటర్లపై అధికారపార్టీ నాయకులు గురి పెట్టారు. శిఖపరువు, నేరళ్లవలస పోలింగ్ కేంద్రాలకు రావాల్సిన ఓటర్లను కొండలపై నుంచి కిందకు దించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పట్టుచెన్నూరు, పగులచెన్నూరు గ్రామాలకు చెందిన గిరిజన ఓటర్లు శిఖపరువు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి. పట్టు చెన్నూరులో ఒడిశా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ ఓటు వేసి గిరిజన ఓటర్లు శిఖపరువులో ఓటు వేయడానికి వీలుపడదు. దీంతో పట్టు చెన్నూరు, పగుల చెన్నూరు గ్రామాల ఓటర్లను శిఖపరువు పోలింగ్ కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు తరలించారు. అలాగే కొటియా, ఎగువశెంబి, దిగువ శెంబి, గంజాయి భద్ర, దూళిభద్ర గ్రామాల ఓటర్లను నేరెళ్లవలస పోలింగ్ కేంద్రం వద్దకు దించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొటియా గ్రామాల ఓటర్లతో ముందు ఎపి పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయించేలా అధికారపార్టీ నాయకులు ప్రయత్నించారు. 21 కొటియా గ్రామాలకు చెందిన మొత్తం 2500 ఓట్లలో అధికశాతం ఓట్లు పోలింగ్ చేయించే ప్రయత్నం లో వున్నారు.

ఆర్‌ఎంపిలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సార్వత్రిక ఎన్నికలలో గ్రామీణ వైద్యులంతా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం కల్పించిన మహోన్నతమైన ఓటు హక్కును వినియోగించుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత మూలమైన ప్రభుత్వాలను ఎంపిక చేసుకొని బాధ్యతను రాజ్యాంగం ఓటు హక్కు ద్వారా మనకు కల్పించినందున, ఆర్‌ఎంపి వైద్యులంతా కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

పిడిఎంఎస్ యాప్‌లో పోలింగ్ శాతం నమోదు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం సేకరించేందుకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోల్ డే మేనేజ్ మెంట్ సిస్టం అనే యాప్ ద్వారా పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు ఆయా నియోజకవర్గాల నుంచి పోలింగ్ శాతం నమోదు చేసేలా ఏర్పాట్లు చేసారు. ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి పిఒలు, సెక్టార్ అధికారులు ఈ యాప్ లో పోలింగ్ వివరాలు చేస్తారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూం ద్వారా ఆయా నియోజకవర్గాల పోలింగ్ వివరాలు సేకరించేందుకు 35 మంది సచివాలయ సిబ్బందితో ఏర్పాట్లు చేసారు.

వికలాంగులు, వృద్ధులకు సాక్షం యాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల్లో జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకునే వయో వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద తగిన వసతులు కల్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఈ వసతులను వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సాక్షం యాప్ లో వారు తమ పేరు నమోదు చేసుకోవలసి వుంటుందని పేర్కొన్నారు. యాప్ లో నమోదు చేసుకున్న వీరికి వీల్‌చైర్, పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువచ్చే విధంగా రవాణా సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, షెల్టర్, పార్కింగ్, వాలంటీర్ సేవలను అందిస్తారని పేర్కొన్నారు. ఆయా ప్రాంత బిఎల్‌ఒల ద్వారా ఈ సేవలు అందిస్తారని తెలిపారు. సాక్షం యాప్ వినియోగంపై రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు సిఇఒ నిర్వహించిన ఆన్ లైన్ సమావేశంలో జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ వసతులపై వృద్ధులకు, వికలాంగులకు అవగాహన కల్పించి ఈ యాప్ ద్వారా అందిస్తున్న సేవలను వారు పొందేలా సూచన చేసినట్లు వికలాంగుల సంక్షేమశాఖ ఎడి జివిబి జగదీష్ తెలిపారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఐజి, ఎస్‌పి

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు

విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి-విజయనగరం కోట

విశాఖపట్నం రేంజ్ పరిధిలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారాజు, అనకాపల్లి జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భద్రతపరమైన అన్ని చర్యలు చేపట్టామని విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని తెలిపారు. ఎన్నికల భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జిల్లాకు విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండు నెలలుగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు విస్తతంగా చర్యలు చేపట్టి, ఎన్‌ఫోర్సుమెంటు కేసులు ఎక్కువగా నమోదు చేసామన్నారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలో 47,000 లీటర్ల ఐడి లిక్కర్, రూ.4.5 కోట్ల నగదు, 16 కిలోల బంగారం, 113 కిలోల వెండి, రూ.11.5 కోట్ల విలువైన గిఫ్టులను స్వాధీనం చేసుకున్నామన్నారు. 18వేల మందిని బైండోవరు చేసామన్నారు. రేంజ్ పరిధిలో 1250 లొకేషన్‌ల ను క్రిటికల్‌గా పరిగణించి, ఎన్నికల కమిషను ఇచ్చిన ఆదేశాలు ప్రకారం కేంద్ర బలగాలు, ఇతర భద్రతా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సివిల్, ఆర్మ్ డ్ రిజర్వు, కేంద్ర బలగాలు, హోంగార్డును బందోబస్తు, రూట్ మొబైల్స్‌లో వినియోగిస్తున్నా మన్నారు. వీరితోపాటు ఎన్‌సిసి, ఎక్స్‌ఆర్మీ, ఎన్ఎస్ఎస్, ఉద్యోగ విరమణ చేసిన యూనిఫాం ఉద్యోగుల సేవలను వాలంటరీగా వినియోగిస్తున్నా మన్నారు. రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కును వినియోగించు కొనేందుకు ప్రజలు నిర్భయంగా బయటకు వచ్చి ఓటు వేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు, భయాలకు లొంగాల్సిన అవసరం లేదని, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వచ్చిన వారికి పోలీసుశాఖ అండగా ఉంటుందని తెలిపారు.

పోలింగు కేంద్రాలు పరిశీలన

అనంతరం విజయనగరం పట్టణంలోని కనపాక యూత్ హాస్టల్ లోని పోలింగు కేంద్రాన్ని, భాష్యం స్కూలు దగ్గరలోని వినాయకనగర్ మున్సిపల్ హై స్కూలులోని పోలింగు కేంద్రాలను డిఐజి విశాల్ గున్నీ, జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారి వెంట ట్రాఫిక్ డిఎస్‌పి విశ్వనాథ్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, స్పెషల్ బ్రాంచ్, టౌన్, రూరల్ సిఐలు పాల్గొన్నారు.